# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- మూడు రోజుల అంతర్జాతీయ దేవాలయాల సదస్సు తిరుపతిలో ఈరోజు ప్రారంభమయ్యింది.
- గులియన్ బారీ - సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి మే నెల కోటాను టీటీడీ రేపు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.
- కోటప్ప కొండ శివరాత్రి ఉత్సవాలను రాష్ట్ర పండుగ హోదాలో ఘనంగా నిర్వహిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

=====================

అంతర్జాతీయ దేవాలయాల సదస్సు, ప్రదర్శన-2025 ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తో కలసి ఈరోజు ప్రారంభించారు. తిరుపతి వేదికగా ఈరోజు నుంచి మూడురోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆలయ నిర్వహణకు సంబంధించిన వినూత్న విధానాలు, ఉత్తమ పద్ధతులను అన్వేషించడం, స్థిరమైన పర్యావరణ వ్యవస్థతో పాటుగా, డిజిటలైజేషన్, ఆధారిత ఆర్థిక వ్యవస్థను పెంపొందించడం వంటి అంశాల మీద చర్చించనున్నారు. మొదటి దేవాలయాల మహాకుంభ్ ను వారణాసిలో 2023లో నిర్వహించగా, ఇప్పుడు తిరుపతిలో నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కలలుగన్న "వికసిత్ భారత్" సాకారంలో దేవాలయాలు భాగస్వామ్యం కావాలని.. వాటి ఆర్థిక పరిపుష్టికి బలమైన పునాదులు వేయాలనే సంకల్పంతో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో 58 దేశాల్లోని 1,581 ఆలయాలకు సంబంధించిన 111 మంది ప్రతినిధులు పాల్గొననున్నారు.

=====================

గులియన్ బారీ - సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అమరావతిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... జీబీఎస్ రోగులకు

ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. రోగులకు సరిపడా ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. చికిత్స తీసుకోకుండానే చాలా వరకు వ్యాధి తగ్గిపోతుందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

=====================

కోటప్ప కొండ శివరాత్రి ఉత్సవాలను రాష్ట్ర పండుగ హోదాలో ఘనంగా నిర్వహిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈరోజు గుంటూరు జిల్లా కోటప్పకొండలో ఉత్సవాల ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, రవాణా, పారిశుధ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో కోటప్ప కొండకు పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని మంత్రి తెలిపారు.

=====================

గుంటూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. కూలీపనుల కోసం వెళ్తున్న మహిళలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విచారకరమన్నారు. మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

కూలీలతో వెళ్తున్న ఆటోను నారాకోడూరు-బుడంపాడు గ్రామాల సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళా వ్యవసాయ కూలీలు మృతి చెందారు. ఆరుగుకి తీవ్ర గాయాలయ్యాయి. వ్యవసాయ పనుల నిమిత్తం సుద్ధపల్లి నుండి మంగళగిరికి ఆటోలో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

=====================

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి మే నెల కోటాను రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్ల కోటాను ఈనెల 21న, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించి ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనుంది. ఇక మే నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈనెల 22న 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించి అదేరోజు ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 22న మధ్యాహ్నం 3 గంటలకు, ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఫిబ్రవరి24న విడుదల చేయనుంది. అలాగే తిరుమల, తిరుపతిలలో మే నెల గదుల కోటాను ఫిబ్రవరి 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టీటీడీ పేర్కొంది.

విరామం

=====================

తిరుపతిలో జరిగే అంతర్జాతీయ దేవాలయాల సదస్సు నిర్వాహకుల ప్రయత్నాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభినందించారు. ఈ సదస్సుపై తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ... అంత్యోదయ ప్రతిష్టాన్ సంస్థకు ప్రధానమంత్రి ఒక లేఖను పంపించారు. జైన్, సిక్కు, బౌద్ధ మతాలకు సంబంధించిన ఆలయాల నిర్వహణ, అభివృద్ధి కోసం పరస్పర భాగస్వామ్యంతో చేస్తున్న ప్రయత్నం సత్ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల పరిపుష్టికి, స్వచ్ఛతకు ఇలాంటి సదస్సులు తోడ్పాటు అందిస్తాయని ఆ లేఖలో ప్రధానమంత్రి పేర్కొన్నారు.

=====================

శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, పండితులు ఆహ్వానించారు. ఈనెల 19వ తేదీ నుంచి మార్చి 1 వరకు ఈ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నివాసంలో ఆలయ పండితులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ముఖ్యమంత్రి అందించారు.

=====================

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఈరోజు మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఆలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్యచౌదరి ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వదించి శ్రీవారి ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు. మరోవైపు గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ ఈరోజు తిరుమలకు విచ్చే సి శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

=====================

శ్రీకాకుళం జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సంక్షోభ నిర్వహణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు. అమోనియం, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటెన్ వంటి మండే స్వభావం ఉన్న వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు ఉండాలన్నారు. విష వాయువులు వెలువడే పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. సంక్షోభ నిర్వహణ కమిటీ జిల్లా స్థాయిలో సమర్థవంతమైన విపత్తు నిర్వహణ అలాగే సంక్షోభ ప్రతిస్పందనకు పూర్తి బాధ్యత వహిస్తుందని చెప్పారు.

=====================

పర్యావరణ హితంగా, పర్యాటకులను ఆకర్షించేలా నడిపే హోటళ్లకు ప్రభుత్వం “గ్రీన్ లీఫ్” రేటింగ్ ఇస్తుందని విజయనగరం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. అందుకోసం ఘన వ్యర్థాలు, మానవ వ్యర్థాలు, మురుగు నీటి నిర్వహణల ఆధారంగా 3 విధాలుగా మార్కులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈరోజు కలక్టర్ కార్యాలయంలో హోటల్ యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లా స్థాయి, డివిజన్ స్థాయిలో సబ్ కమిటీ లు హోటల్స్ ను తనిఖీ చేసి రేటింగ్ కోసం సిఫార్సు చేస్తాయన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఈ రేటింగ్ ను హోటళ్ళు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసుకోవచ్చునని, అందువలన ఆయా హోటళ్ళ ర్యాంకింగ్ బుక్ చేసుకునే వారికీ తెలుస్తుందని పేర్కొన్నారు. హోటళ్ల నిర్వహణ పర్యావరణ హింతంగా ఉండాలని, దాని కోసం వారి సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు, హోటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, పచ్చదనాన్ని పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

=====================

తుని మున్సిపల్ ఉపాధ్యక్ష ఎన్నికకు కోరం లేకపోవడంతో రేపటికి వాయిదా వేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు.

=====================
=====================